క్లుప్తంగా

సాక్షిగణపతికి విశేషపూజలు


సాక్షిగణపతి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థమై బుధవారం సాయంత్రం సాక్షిగణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలావీరభద్రస్వామికి విశేషపూజలు నిర్వహించారు. సాక్షిగణపతి స్వామికి పంచామృతాలతోను, ఫలోదకాలతోను, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోధకం, శుద్ధజలంతో అభిషేకం చేసి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలను చేపట్టారు. అలాగే జ్వాలావీరభద్రస్వామివారికి అభిషేకం, విశేషపుష్పార్చన జరిపించారు.

నేడు లక్ష్మీచెన్నకేశవస్వామి కల్యాణం

పగిడ్యాల: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం బస్టాండు సమీపాన గల ఆలయంలో లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవానిన ఘనంగా నిర్వహించేందుకు దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఆవరణాన్ని శుభ్ర పరిచి భక్తులకు అసౌకర్యం కలుగకుండా చలువ పందిళ్లు వేయించారు. కళ్యాణ మహోత్సవం అనంతరం పుల్యాల చరణ్‌రెడ్డి జ్ఞాపకార్థం రెడ్డీస్ యూత్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేయనున్నారు.

అన్నదాన పథకానికి విరాళం


విరాళం అందించిన దాతలకు లడ్డూప్రసాదాలను అందజేస్తున్న అధికారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలుకు చెందిన బీరం విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం రూ.1,00,000 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని విరాళాల కేంద్రంలోని అధికారులకు అందజేయగా, వారు దాతలకు స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూప్రసాదాలు, విరాళానికి సంబంధించిన బాండును అందజేశారు.

నీటి సమస్య తలెత్తనివ్వం

పాములపాడు:గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తనివ్వమని సర్పంచు వరప్రసాద్ అన్నారు. బుధవారంమండలంలోని తుమ్మలూరు గ్రామ పంచాయతీలో వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి కొరత ఏర్పడకుండా పైపులైన్ మరమ్మతులు చేపట్టారు. అలాగే ఇటీవల నిర్మాణం చేపట్టిన డ్రైనేజీకి అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన విద్యుత్ స్తంభాలను మరో చోట ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

భూ సర్వేపై డాక్యుమెంటరీ


డాక్యుమెంటరీకి క్లాప్‌కొడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు

ఆత్మకూరు: భూముల రీ సర్వేపై డాక్యుమెంటరీని పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు క్లాప్‌కొట్టి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 123 పురపాలకసంఘాలలో ఎవ్వరూ చేయని షార్ట్‌ఫిల్మ్‌ను ఆత్మకూరు పురపాలక సంఘంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టౌన్‌ప్లాన్ ఆఫీసర్ ఆధ్వర్యంలో షార్ట్‌ఫిల్మ్ తీస్తున్నట్లు వెల్లడించారు.

టోల్‌గేట్ క్యాబిన్‌ను ఢీకొన్న బొలెరో వాహనం


క్యాబిన్‌ను ఢీకొన్న బొలెరో పికప్ వాహనం

శ్రీశైలం: క్షేత్ర పరిధిలోని దేవస్థానం టోల్‌గేట్‌ను బొలెరో పికప్ వాహనం (టీఎస్19టిఏ 1014) టోల్‌గేట్ క్యాబిన్‌ను బుధవారం మధ్యాహ్నం ఢీకొంది. బ్రేక్‌ఫెయిల్ కావడంతో అదుపుతప్పి డివైడర్ మధ్యలో ఉన్న టిక్కెట్ కౌంటర్ క్యాబిన్‌ను ఢీకొని ఆగిపోయింది. వెంటనే టోల్‌గేట్ సిబ్బంది దేవస్థానం ఉన్నతాధికారులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న దేవస్థానం అధికారులు, పోలీసులు, సిబ్బంది వ్యాన్‌ను వెనక్కి తోసి ట్రాఫిక్ అంతరాయం కలుగకుండా చేశారు. ఈ సంఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

8 మంది విద్యార్థుల డిబార్

నందికొట్కూరు: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో బుధవారం మాస్ కాపీయింగ్ పాల్పడుతున్న నంది జూనియర్ కళాశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులను స్టేట్ అబ్జర్వర్ రవిశంకర్ నాయక్ డిబార్ చేయగా, సిటింగ్ స్క్వాడ్ సునీల్ ఒకరిని, డీఓ ప్రభుత్వ కళాశాలకు చెందిన ఒకరిని డిబార్ చేశారు. కాపీలు, జవాబు రెండు ఒకటే ఉంటే రెండేళ్ల వరకు డిబార్ చేయడం జరుగుతుందన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- 'పది' పరీక్షలకు అంబేడ్కర్ గురుకులాలు సన్నద్ధం
- ప్రత్యేక ప్రణాళికతో ముందుకు
- వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు


జూపాడుబంగ్లా బాలుర గురుకులంలో ప్రత్యేక తరగతుల్లో పదో తరగతి విద్యార్థులు

నందికొట్కూరు: పదో తరగతి విద్యార్థుల చదువుపై అంబేడ్కర్ గురుకులాల్లో ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ సారిస్తున్నారు. వందశాతం ఫలితాలే లక్ష్యంగా కార్యాచరణ చేపట్టారు. ఇందుకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గ్రూపులుగా విభజించి పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా మానసికంగా ఒత్తిడికి గురికాకుండా ఉండేందుకు విద్యార్థులకు సూచనలిస్తూ, ప్రణాళిక ప్రకారం చదివిస్తూ అన్ని విధాలా సంసిద్ధులను చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 14 గురుకులాలు

విద్యార్థులు పక్కా ప్రణాళికతో చదవడంతో పాటు పరీక్షల సమయంలో ఒత్తిడి లేకుండా పరీక్షలు రాస్తే మంచి ఫలితాలు సాధించవచ్చంటున్నారు. ప్రధానంగా పరీక్షల సమయంలో సమయాన్ని వృథా చేయకుండా చూసుకోవడంతో పాటు విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచిస్తున్నారు. ఏప్రిల్ నెల 3వ తేదీ నుంచి జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలో 14 గురుకులాలు ఉండగా అందులో 1,040 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయనున్నారు.

గురుకులాల ప్రణాళిక ఇదీ

పదోవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించి రికార్డు నెలకొల్పేందుకు సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ప్రణాళిక సిద్ధం చేసింది. రాష్ట్ర స్థాయిలో అకడమిక్ మానిటరింగ్ యూనిట్ నిరంతర పర్యవేక్షణతో పాటు జిల్లా స్థాయిలో జిల్లా సమన్వయ అధికారుల ద్వారా అంబేడ్కర్ గురుకులాల వారీగా పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. సబ్జెక్టుల వారీగా నిపుణులైన ఉపాధ్యాయులను బృందాలుగా నియమించి మేధోమథనం (బ్రెయిన్ స్టార్మింగ్ వర్క్‌షాప్) నిర్వహించి పబ్లిక్ పరీక్షల కోసం విద్యార్థులకు తర్ఫీదు ఇస్తున్నారు. నెలవారీ సిలబస్, వారాల సిలబస్‌గా (మైక్రో షెడ్యూల్ విభజించి) సబ్జెక్ట్, అంశాల వారీగా ముందుగానే సన్నద్ధం చేసేందుకు పబ్లిక్ పరీక్షల తరహాలోనే గురుకులాల క్యాంపస్‌ల్లో నమూనా ప్రశ్నపత్రాలతో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

విద్యార్థులు పాటించాల్సిన నియమాలు

- పదో తరగతి విద్యార్థులు వేకుజామున మెదడుకు పని పెట్టాలి.
- బట్టీ పద్ధతికి స్వస్తి చెప్పి పాఠ్యాంశాలను చదవాలి.
- చదివిన పాఠాలు పదేపదే మననం చేసుకోవాలి.
- పాఠ్యాంశాలను స్నేహితులతో కలసి చదువుకోవడం, చర్చించుకోవాలి.
- రాత్రి 10.30 గంటల వరకూ చదువుకున్ని నిద్రపోవాలి.
- చల్లనీ నీళ్లతో కళ్లు, ముఖం శుభ్రం చేసుకుంటే ఒత్తిడి తగ్గిపోతుంది.

నూరుశాతం ఫలితాలే లక్ష్యం

పేద విద్యార్థులు చదివే అంబేడ్కర్ గురుకులాల్లో మెరుగైన వసతులు ప్రభుత్వం కల్పించింది. పదోవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో కార్పొరేట్ విద్యాసంస్థల కు దీటుగా ఉండాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. అందుకు అనుగుణంగా సాంఘిక సంక్షేమ అంబేడ్కర్ గురుకులాల్లో విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. ఈ ఏడాది నూరు శాతం సాధించి సత్తా చాటేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం .ఇప్పటికే సిలబస్ పూర్తి చేసి రివిజన్‌తో విద్యార్థుల సందేహాలను నివృత్తిచేసేలా సబ్జెక్టుల వారీగా నిపుణులైన అధ్యాపకులను అందుబాటులో ఉంచుతున్నాం.

– శ్రీదేవి, జిల్లా కో ఆర్డినేటర్ కర్నూలు

బట్టీ విధానానికి స్వస్తి పలికాలి



బట్టీ విధానానికి స్వస్తి పలికి, సమాకాలీన అంశాలపై మంచి అవగాహన ఉండాలి. బట్టీ విధానం కాకుండా సమాచార విశ్లేషణ. నైపుణ్యాలకు సంబంధించిన విషయాలపై వచ్చే ప్రశ్నలకు సమాధానాలు సులువుగా రాయవచ్చు. అన్ని సబ్జెక్టుల్లో ప్రత్యేక దృష్టి పెడితే నూరు శాతం మార్కులు వస్తాయి.

– రాజు, గురుకులం ప్రిన్సిపాల్ జూపాడుబంగ్లా

పాయింట్ల రూపంలో నోట్స్



భౌతిక, రసాయన శాస్త్రంలో ప్రాథమిక విషయాలపై పట్టు సాధించడం వల్ల అధికంగా మార్కులు వస్తాయి. ముఖ్యమైన పాయింట్ల రైపంలో నోట్స్‌లో రాసుకోవాలి. ఫార్ములాలపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు బొమ్మల్ని సాధన చేయాలి. ప్రయోగాలపై ఎక్కువ దృష్టి సారించాలి. ప్రశ్నకు పటం వేసేందుకు ప్రయత్నిస్తే పూర్తి మార్కులు పొందే అవకాశం ఉంది.

– సుబ్బారెడ్డి, సైన్స్ టీచర్ జూపాడుబంగ్లా

శ్రద్ధగా సాధన చేస్తే మంచి మార్కులు



శ్రద్ధగా లెక్కలు సాధన చేస్తే మంచి మార్కులు తప్పని సరిగ్గా వస్తాయి. ప్రశ్న పత్రాన్ని ముందుగా చదివి అవగాహన చేసుకోవాలి. ముఖ్యమైన లెక్కలను విద్యార్థులు గుర్తు పెట్టుకోవాలి. నేర్చుకున్న దాంతో పాటు ఆలోచించి సృజనాత్మకంగా పరీక్షలు రాయాలి. పరీక్షలు రాసేటప్పుడు తప్పులు దొరలకుండా చూసుకుంటే మంచి మార్కులు సాధించవచ్చు.

– లక్ష్మిప్రసూన్న, మ్యాథ్స్ టీచర్ లక్ష్మాపురం

ప్రశ్నలు అర్థం చేసుకోవాలి



విద్యార్థులు ఇంగ్లిషు అంటే భయపడుతుంటారు. ముందు భయం వీడాలి. గ్రామర్‌పై పట్టు సాధించాలి. గ్రామర్‌పై పట్టు, ఆలోచించే తెలివి తేటలు ఉంటే ఇంగ్లిషులో నూరు శాతం మార్కులు సాధించవచ్చు. ముందు ప్రశ్నాపత్రం కుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలి.

– ఫిలోమెన్, ఇంగ్లిషు టీచర్, జూపాడుబంగ్లా

సమస్యల పరిష్కారానికి కృషి చేద్దాం


మాట్లాడుతున్న చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి

నందికొట్కూరు: పట్టణ సమస్యలను పరిష్కరించేందుకు అందరం కలిసి కట్టుగా కృషి చేద్దామని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో ఏర్పాటు చేసిన మున్సిపల్ సాధారణ సమావేశంలో మున్సిపల్ అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు చర్చించారు. కార్మికులు వేళలు పాటించాలని కౌన్సిలరు రవూఫ్ చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఉదయం 8.30 గంటలకే ఇంటికి వెళ్తున్నారని చెప్పారు. మిగత కౌన్సిలర్లు విద్యుత్ సమస్య, తీగలు వేలాడుతున్న విషయం గురించి చర్చించారు. పందులు, కుక్కలు బెడద నుంచి పట్టణ ప్రజలను రక్షించాలని కౌన్సిలర్లు కోరారు. చైర్మన్ మాట్లాడుతూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సమావేశంలో వైస్ చైర్మన్లు రబ్బానీ, ప్రశాంతి, కమిషనర్ కిషోర్, డీఈ నబి రసూల్, టీపీఓ బాలమద్దయ్య, డిప్యూటీ తహసీల్దార్ పద్మా, ఎంఈఓ ఫైజూన్నీసాబేగం,విద్యుత్ ఏఈ రాములనాయక్, హౌసింగ్ ఏఈ అరుణ్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

తర్తూరు రంగనాథుడికి పట్టువస్త్రాల సమర్పణ


పట్టువస్త్రాలు తీసుకొస్తున్న తహసీల్దార్ దంపతులు

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని బుధవారం జూపాడుబంగ్లా తహసీల్దారు పుల్లయ్య యాదవ్, లీలావతి దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీలక్ష్మీరంగనాథుని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ప్రతి ఏటా స్వామివారు పెళ్లికుమారునిగా ముస్తాబయ్యే పూల చపురం ఉత్సవం నాడు స్వామి, అమ్మవార్లకు ప్రభుత్వం తరుపున పట్టుస్త్రాలు అందజేయటం ఆనవాయితీగా వస్తోంది. తహసీల్దార్ దంపతులకు ఆలయ ఈఓ వెంకటరమణ, ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తహసీల్దార్ తెచ్చిన పట్టువస్త్రాలను అర్చకులకు అందజేయగా వారు వేదమంత్రాల మధ్య స్వామివారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అధికారి వెంకటరమణ తహసీల్దార్ దంపతులను సత్కరించగా, అర్చకులు వేదఆశీర్వచనాలు పలికారు. కార్యక్రమంలో సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, సీనియర్ అసిస్టెంటు శ్రీరంగారెడ్డి, ఆర్డీఓ కార్యాలయ వీఆర్వో జగదీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గూడేల్లో వసతుల కల్పనకు కృషి


గిరిజనులతో సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్‌డీఓ జనార్దన్ రావు

కొత్తపల్లి: గిరిజన గూడేల్లో చెంచులకు అన్ని వసతుల కల్పనకు కృషి చేస్తామని డిస్ట్రిక్ట్ లేవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ జనార్దన్ రావు అన్నారు. బుధవారం మండలంలోని ముసలిమడుగు గూడెంలో ఎంపీడీఓ మేరి, సర్పంచు జమిలాబీలతో కలసి పర్యటించారు. చెంచులకు ఏఏ అవసరాలు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. స్థలాలులేని వారికి స్థలాలు, పక్కాగృహాలు, గూడెంలో ట్రాన్స్‌పార్మర్‌కు ప్యానల్‌బోర్డును ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. అదేవిధంగా గూడెంలో సీసీ రోడ్లు ఉన్న డ్రైనేజీలు లేవని దీంతో వర్షపు, మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుందని డ్రైనేజీ ఏర్పాటు చేయాలని విన్నవించారు. అనంతర ముసలిమడుగు గ్రామంలోని బస్టాండ్ అవరణలో సర్పంచు జమిలాబీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఎర్రమఠం ఎంపీటీసీ ముబీనాబేగం, పంచాయతీ కార్యదర్శి షాహిన్నా, మాజీ వైస్ ఎంపీపీ మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుల అత్యుత్సాహం

- ప్రభుత్వ స్థలంలో పార్టీ జెండావిష్కరణకు యత్నం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రజలు

మహానంది: మండల పరిధిలోని బుక్కాపురం, తమ్మడపల్లె గ్రామాల సరిహద్దులో ఇంజవాణి చెరువుంది. చెరువు పక్కనే కాలువ, పక్కన రోడ్డు ఉండటంతో ఆ స్థలం ఆర్‌అండ్‌బీకి చెందుతుంది. అయితే టీడీపీ నాయకులు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం ఉండటంతో రాత్రికి రాత్రే సిమెంట్ దిమ్మెను ఏర్పాటు చేశారు. బుధవారం ఉదయం నియోజకవర్గ, మండల నేతలు జెండావిష్కరణకు తరలివచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, మహానంది ఎస్‌ఐ నాగార్జునరెడ్డితో పాటు ఆర్‌అండ్‌బీ, మైనర్ ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు గ్రామానికి చేరుకుని క్షేత్రస్థాయిలో పరిశీలించి విచారణ చేయగా స్థలం ప్రభుత్వానిదే అని నిర్ధారించారు. అయినప్పటికీ టీడీపీ నాయకులు గ్రామస్తులతో వాగ్వాదానికి దిగి నిరసన వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడికి చేరుకున్న సీఐ ఇస్మాయిల్, మహానంది, బండిఆత్మకూరు ఎస్‌ఐలు సీసీ నాగార్జునరెడ్డి, బాబు, పోలీసు సిబ్బంది అడ్డుకోవడంతో వివాదం సద్దుమణిగింది. ఎలాంటి వివాదాలు చోటు చేసుకోకుండా గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉచిత వైద్య శిబిరం

నందికొట్కూరు: ప్రజల ఆరోగ్యం కోసం ఉచిత మెడికల్ క్యాంపు ఏర్పాట్లు చేసినట్లు బిజినవేముల గ్రామ సర్పంచు రవియాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని బిజినవేముల గ్రామంలో అమీలియో హాస్పిటల్ సహకారంతో సర్వరోగాలకు ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. అనంతరం ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఇఫ్‌కో జిల్లా మేనేజర్ జగదీష్, సేల్స్ మేనేజర్ ఇర్ఫాన్‌బాషా పాల్గొన్నారు.

విద్యుత్ కోతలు ఆపాలి

నందికొట్కూరు: రంజాన్ మాసంలో విద్యుత్ కోతలు ఆపాలని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా నియోజకవర్గ ఇన్‌చార్జ్ అన్వర్‌బాషా కోరారు. బుధవారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో ఏఈ రాములనాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ వేకుజామున 3 గంటల సమయంలో ఉపవాసం ఉండటం కోసం వంట చేయడానికి, ఇతర కార్యకలాపాలకు కరెంట్ అవసరం ఉందని చెప్పారు.

మహిళా సాధికారతే ధ్యేయం


మహిళలకు చెక్కును అందజేస్తున్న మున్సిపాలిటీ మేనేజర్ బేబి

నందికొట్కూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళ సాధికారత ధ్యేయంగా పని చేస్తున్నారని మున్సిపాలిటి మేనేజర్ బేబి అన్నారు. బుధవారం పట్టణంలోని 2, 3, 4, 5 వార్డులకు చెందిన 85 పొదుపు మహిళా సంఘాలకు వైఎస్సార్ ఆసరా కింద రూ. 50,34,828 చెక్కును అందజేశారు. ఆమె మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో వైఎస్సార్ ఆసరా పథకం ప్రభుత్వం ఇస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలు మహిళల ఖాతాలోకి నేరుగా సీఎం జమ చేస్తున్నారని చెప్పారు. పట్టణ సమాఖ్య ప్రెసిడెంట్ ప్రమీల, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాత సతమతం


జూపాడుబంగ్లాలో వర్షానికి ధాన్యం తడవకుండా టార్పాలిన్ కప్పుతున్న రైతులు


వర్షంలో మొక్కజొన్న ధాన్యం తడవకుండా పట్టాలు కప్పి ఉంచిన దృశ్యం


మునగ కాయలను చూపిస్తూ విలపిస్తున్న రైతు సలీంబాషా

జూపాడుబంగ్లా: బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆకాశంలో సూర్యుడు మండుతూ నిప్పులు కురిపించాడు. మధ్యాహ్నం అనంతరం ఒక్కసారిగా ఆకాశంలో మేఘాలు కమ్ముకోవటంతో కల్లాల్లో మొక్కజొన్న, మిరపపండు ఆరబెట్టుకున్న రైతులు అవి తడవకుండా కప్పి ఉంచుకొనేందుకు సతమతమయ్యారు. ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం కురవటంతో రైతులు ధాన్యాన్ని కాపాడుకోవడానికి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వర్షంలోనే తడుస్తూ చేతికందిన ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టాలతో కప్పిపెట్టుకున్నారు. సాయంత్రానికి ఆకాశంలో మబ్బులు వీడి వర్షం తగ్గటంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

పెనుగాలుల బీభత్సం

పగిద్యాల: గురువారం మధ్యాహ్నం పెనుగాలులు సృష్టించిన ప్రకోపానికి ఓ రైతు మునగ మొక్కలు వేర్లతో సహా చెల్లాచెదురై నేలకొరిగాయి. దాదాపు గంట వరకు పెనుగాలుల బీభత్సానికి కాపుకు వచ్చిన మునగ పంట ధ్వంసం కావడంతో ఆ రైతు బాధ వర్ణాణతీతం. లక్ష్మాపురం గ్రామానికి చెందిన సలీంబాషా బావి కింద ఒక ఎకరంలో మునగ మొక్కలు నాటాడు. ప్రస్తుతం మునగ మొక్కలు కాపుకు వచ్చి దిగుబడినిస్తున్నాయి. అయితే గాలి వాన తాకిడికి మొక్కలన్ని వేర్లతో సహా కొట్టుకు పోవడం చూసి లబోదిబోమని విలపిస్తున్నాడు. దాదాపు రూ.50 వేల ఆస్తినష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకున్నారు.

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం

మిడుతూరు: మండలకేంద్రమైన మిడుతూరుతో పాటు పీరుసాహెబ్ పేట, చింతలపల్లి, వీపనగండ్ల, చెరుకుచెర్ల, జలకనూరు తదితర గ్రామాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మధ్యాహ్న సమయంలో కురిసింది. దీంతో పొలాల్లో ఆరబెట్టుకున్న పండు మిరప రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన ఆకాల వర్షాలకు వడగండ్ల వానకు పండుమిరప, మొక్కజొన్న, మినుము పంటలు దెబ్బతిన్నాయి. మళ్లీ అకాల వర్షాలు కురియడంతో రైతులు దిగాలు చెందుతున్నారు.

పొలం విషయంపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

కొత్తపల్లి: కొత్తపల్లి గ్రామానికి చెందిన గూడెం సురేష్‌కు చెందిన సర్వే నం 480, 481, 482 లో సాగుచేసుకొన్న పంటను 2021 సంవత్సరంలో అగ్రకుల రైతులు, అధికారులతో కలసి చెడగొట్టి అక్రమంగా రహదారి నిర్మించారు. ఈ విషయంపై ఏ అధికారికి ఫిర్యాదు చేసిన న్యాయం చేయలేదు. దీంతో గూడెం సురేష్, రాష్ట్ర దళితనాయులతో కలసి ఢిల్లీలో బుధవారం జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ సుభాష్ రామ్‌నాథ్ పరిధిని ఆశ్రయించి న్యాయం చేయాలని ఫిర్యాదు చేశారు. సమతా సైనిక్ దళ్ రాష్ట్ర అధ్యక్షుడు కంచర్ల చిట్టిబాబు, జనరల్ సెక్రటరీ ఇర్లపాటి ప్రవీణ్ కుమార్, దళిత అభ్యుదయ పోరాట వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పెరియార్ అంబేడ్కర్ పూలే ఉన్నారు.

ఆర్థిక సాయం

కొత్తపల్లి: మండలంలోని పెద్దగుమ్మడాపురం గ్రామంలో బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యకర్త జి.బాలస్వామి (70) అనారోగ్యంతో మృతిచెందారు. మృతుని కుటుంబానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకుడు తొగట నాగర్జున ప్రసాద్ రూ. 5000 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జె.రాము, మల్లయ్య, నాగన్న, జాముడు, స్వాములు పరామర్శించారు.

నేడు సీతారాముల కల్యాణ మహోత్సవం

మిడుతూరు: మండలపరిధిలోని సుంకేసుల గ్రామంలో శ్రీ రామనవమిని పురస్కరించుకొని గురువారం ఉదయం 8 గంటలకు సీతారాముల కల్యాణ మహోత్సవం, పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు శ్రీ రామదత్త శ్రమ వ్యవస్థాపకులు జూలకంటి మల్లికార్జునరావు తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కుంభాభిషేకం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం ఉంటుందన్నారు.

రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

మిడుతూరు: మండల పరిధిలోని ఉప్పలదడియ గ్రామంలో 4వ తేదీ మంగళవారం 8 గంటలకు రాష్ట్రస్థాయి (ఆరుపండ్ల విభాగంలో)లో ఎడ్ల బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు కమతం జయరామిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ శ్రీరామనవమి, రంజాన్, గుడ్‌ఫ్రైడే వేడుకలు పురస్కరించుకొని ఉప్పలదడియ గ్రామ ప్రజల సహకారంతో ఆరు పండ్ల విభాగంలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో విజేతలకు వరుసగా రూ. 40వేలు, రూ. 30వేలు, రూ. 20వేలు, రూ. 10 వేలు, రూ. 6 వేలు నగదును అందజేయనున్నట్లు తెలిపారు. బహుమతులు రాని ఎడ్ల జతకు రూ. 3000 నగదు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కల ఎడ్ల యజమానులు రూ. 500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు.

మరుగుదొడ్లకు నిధులు మంజూరు చేయాలి

పగిద్యాల: మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి నిధులు మంజూరు చేయాలని సీపీఐ మండల కార్యదర్శి అబ్దుల్‌మజీద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆ పార్టీ కార్యకర్తలతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టారు. మరుగుదొడ్లు నిర్మాణాలకు రూ. 50 వేలు నిధులు మంజూరు చేసి ఆదుకోవాలన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ సుభద్రమ్మకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సోఫీసాహెబ్, అబ్దుల్ రహిమాన్, చిన్న సాయిబాబా, మస్తాన్‌ఖాన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బాలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

పగిద్యాల/పాములపాడు/జూపాడుబంగ్లా: 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కస్తూర్బా బాలికల విద్యాలయంలో ఆరో తరగతి, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కస్తూర్బా విద్యాలయాల ప్రత్యేక అధికారిణులు జరీనా, రాజ్యలక్ష్మి, యశోద కోరారు. ఆరో తరగతిలో 40 మంది విద్యార్థినులు చేరేందుకు అవకాశం ఉందన్నారు. అలాగే ఇంటర్ మీడియెట్ మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో 40 సీట్లు ఖాళీలు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 20వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు.

అకౌంటెంట్ మృతిపై విచారణ జరపాలి

మిడుతూరు:స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం (వెలుగు) కార్యాలయంలో అకౌంటెంట్ మాధవస్వామి మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి, బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని సీపీఐ జిల్లా నాయకులు రఘురామమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సీపీఐ కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ అధికారుల వేధింపుల వల్ల చిరుద్యోగి ఆత్మహత్య చేసుకోవడం బాధకరమన్నారు. మృతుడి కుటుంబానికి , కుటుంబపోషణకు రూ. 20 లక్షల ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని, అదేవిధంగా భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు రామచంద్రుడు, వీరస్వామి, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగించాలి

జూపాడుబంగ్లా: తాటిపాడు ఫీల్డ్‌అసిస్టెంటు చిన్న లింగన్న ఉపాధిపనుల్లో అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు రుజువైనా అతన్ని అధికారులు తొలగించకపోవటానికి కారణం ఏంటని తాటిపాడు సర్పంచ్ వంగల లక్ష్మిదేవి ప్రశ్నించారు. బుధవారం ఆమె స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో భర్త కృష్ణారెడ్డితో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2022 జనవరి 4న జరిగిన సోషల్ ఆడిట్‌లో ఫీల్డ్‌అసిస్టెంటు లింగన్న రూ. 31,433 అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు నిగ్గుతేల్చటంతో అతన్ని 2022 మార్చి 14న సస్పెండ్ చేసినట్లు తెలిపారు. అతను హైకోర్టుకు వెళ్లి కేవలం లాయర్ నోటీసు పంపించినందుకు జిల్లా అధికారులు విధుల్లోకి తీసుకోవడం సమంజసం కాదన్నారు. సత్వరమే అధికారులు ఫీల్డ్ అసిస్టెంటుపై తగిన చర్యలు తీసుకొని గ్రామంలో వెంటనే ఉపాధి పనులు ప్రారంభం అయ్యేలా చేయాలని కోరారు.

వడ్డీమాఫీకి మరో రెండు రోజుల గడువు

ఆత్మకూరు: మున్సిపాలిటీ పరిధిలో పన్నులు బకాయిలను ఈ నెల 31వ తేదీలోగా చెల్లిస్తే వడ్డీ మాఫీ అవుతుందని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. వడ్డీమాఫీ గడువు కేవలం రెండు రోజులు మాత్రమే ఉందన్నారు. సెలవు అయినప్పటికీ ఈ నెల 30వ తేదిన మున్సిపల్ కార్యాలయం యాథావిధిగా పనిచేస్తుందని చెప్పారు.

సాగు పద్ధతులపై అవగాహన

పాములపాడు: ఖరీఫ్ సాగుకు సమాయత్తమవటానికి ఆచరించే పద్ధతుల గురించి తెలుసుకోవాలని ఏఓ ఫణీశ్వరరెడ్డి,జిల్లా వనరులకేంద్రం ఏఓ హేమలత అన్నారు. బుధవారం మిట్టకందాల ఆర్బీకేలో రైతులతో సమావేశం నిర్వహించా రు. భూసార పరీక్షల ఆవశ్యకత, వేసవిలో లోతు దుక్కులు, పచ్చిరొట్టె ఎరువులగురించి వివరించారు.